భక్తి ఉద్యమాల స్వభావం... ప్రాధాన్యం


హిందూమతంలోని కర్మకాండకు, కులవ్యవస్థకు ఎంతో ప్రాధాన్యం ఉన్న సంగతి తెలిసిందే. కానీ వీటికి వ్యతిరేకంగా ప్రాచీన జైన-బౌద్ధ మతాలు విశేష కృషి చేశాయి. అయితే, మధ్యయుగం ఆరంభం నాటికి ఈ రెండు మతాలు తమ ప్రాభవం కోల్పోయాయి. మధ్యయుగంలో వాకాటకులు, విష్ణు కుండినులు, చాళుక్యులు, హైందవ మత పూర్వ వైభవానికి నిరంతర కృషి చేశారు. గుళ్లు, గోపురాలు, యజ్ఞ, యాగాలు, వైదిక కర్మకాండలను ప్రోత్సహించారు. క్రీ.శ. 8, 9, 10 శతాబ్దాల్లో దక్షిణాదిలో నాయనార్లు, ఆళ్వారులు భక్తిమార్గాన్ని ప్రబోధించారు. శివభక్తుల్లో (నాయనార్లు) అప్పారు, తిరుజ్ఞాన సంబంధార్, మాణిక్య నాచకర్ సుందరమూర్తి విశేష ఖ్యాతిని ఆర్జించారు. వీరు ప్రవచించిన కవితలు, కీర్తనలను సేకరించి తేవారమ్, తిరువాచకమ్ అనే గ్రంథాలు వెలువరించారు.

వర్ణ వివక్షలేని ఆళ్వారులు..

దక్షిణ భారతదేశంలో మొత్తం పన్నెండు మంది 'వైష్ణవ ఆళ్వారులు' భక్తిమార్గాన్ని అనుసరించారు. వీరు కుల, వర్ణ, వివక్ష చూపకుండా అచంచల వైష్ణవ భక్తితో ప్రబోధం చేశారు. వారిలో నమ్మాళ్వార్ ఆండాళ్ ప్రధానమైనవారు. తర్వాత కాలంలో రామానుజుడు, నింబార్కుడు, మధ్వాచార్యులు, శంకరుడు గొప్ప వైష్ణవ భక్తులుగా నిలిచారు. వీరు ప్రభోదించిన 'భగవత్ స్తోత్రాలు', రాసిన కృతులను... 'నాలాయిర ప్రబంధం' అనే పేరుతో సంకలనం చేశారు. నాయనార్లు, ఆళ్వార్లు ప్రభోదించిన సిద్ధాంతాలను ప్రాతిపదికగా తీసుకుని మధ్యయుగ భారతదేశ చరిత్రలో... ప్రధానంగా క్రీ.శ. 13 నుంచి క్రీ.శ. 17వ శతాబ్దం వరకు జరిగిన భక్తి ఉద్యమం భారతీయుల్లో విశేష మార్పు తెచ్చింది. భక్తి ఉద్యమ ప్రచారానికి నింబార్కుడు, వల్లభా చార్యుడు, చైతన్యుడు, రామానందుడు, కబీరు, తులసీదాసు, నామ్‌దేవ్, గురు నానక్, తుకారాం, రవిదాసు, ఏకనాథుడు, సూరదాసు, జ్ఞానేశ్వర్, సుందరవాసు, మీరాబాయి, విద్యాపతి, రామానుజుడు, మధ్వాచార్యుడు తదితర భక్తి ఉద్యమకారులు ఉత్తర-దక్షిణ భారత్‌లో విశేష కృషి చేశారు.

భక్తి ఉద్యమం అంటే...

'భక్తి' అంటే భజించడం, సేవించడం, అర్చించడం, ప్రేమించడం. ఆత్మ పరిశుద్ధతను 'భక్తి' అన్నారు. నిరంతరం, నిరాటంకంగా భగవంతుడి పట్ల అసామాన్య ప్రేమను కలిగుండటమే 'భక్తి' అనేది శంకరాచార్యుల ప్రబోధం. 'భక్తి' అంటే ఈశ్వరుణ్ని ఉపాసించడమని రామానుజాచార్యుడు చెప్పారు. భగవంతుణ్ని పుత్ర వాత్సల్యంతో ప్రేమించడాన్ని వాత్సల్య భక్తిగా.. ప్రాణనాథుడిగా భావించి, ఉపాసించడాన్ని మధురభక్తిగా పేర్కొన్నారు.



భక్తి ఉద్యమ ప్రాధాన్యత

మధ్యయుగ భారతదేశంలో క్రీ.శ.14-15 శతాబ్దాల్లో రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాలకు సంబంధించి అనేక మార్పులు సంభవించాయి. కేంద్రీకృత రాజ్యాలు పతనమయ్యాయి. భూస్వామ్య ప్రభువుల ఘర్షణలు, సామంతరాజుల తిరుగుబాట్లు చోటు చేసుకున్నాయి. ఈ పరిస్థితుల్లో సమాజంలో అట్టడుగున ఉన్న బడుగువర్గాల సముద్ధరణకు కొన్ని సామాజిక, ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో భక్తి ఉద్యమం ఆవిర్భవించింది. ప్రారం భంలో భక్తి ఉద్యమాన్ని కేవలం సాహిత్య ఉద్యమం లేదా మత ప్రాతిపదికకు ప్రేరణశక్తిగా పరిగణించారు. అయితే ఆనాటి సాంఘిక, ఆర్థిక పరిస్థితులను పరిశీలిస్తే 'భక్తి' ఉద్యమం... ఆనాటి ప్రజల భావ వ్యక్తీకరణకు కూడా ఉపయోగపడిన ఉద్యమం అని తెలుస్తోంది. హిందూ-ముస్లిం మేధావి వర్గాల మధ్య విస్తృతమైన సంబంధాలు ఏర్పడటం వల్ల భక్తి ఉద్యమం రెండో దశకు చేరుకుంది. మధ్యయుగంలో రామానందుడు, కబీర్, నానక్, వల్లభాచార్యుడు, మీరాబాయి, చైతన్యుడు తదితరుల వల్ల ఈ ఉద్యమానికి ఎంతో ప్రాచుర్యం లభించింది. ఈ ఉద్యమానికి కొన్ని విశిష్ట లక్షణాలున్నాయి. అవి... దీన్ని చేపట్టిన వారంతా తమ బోధనలను సంస్కృత భాషకు బదులు ప్రాంతీయ భాషల్లో ప్రచారం చేయడం, గ్రంథాలను స్థానిక భాషల్లోనే ప్రచురించడం. భక్తి ఉద్యమకారులందరిలోనూ కొన్ని ఉమ్మలి లక్షణాలున్నాయి. అవి...

భగవంతుడొక్కడే అని నమ్మడం (ఏకేశ్వరోపాసకులు)
విగ్రహారాధనను, మత కర్మకాండను, తీర్థయాత్రలను నిరసించడం
కుల, వర్గ, మత బేధాలకు అతీతులుగా ఉండాలని ప్రభోదించడం
హిందూ-ముస్లిం సఖ్యత కోసం పాటుపడటం
ఉద్యమకారులెక్కువగా అట్టడుగు జాతి నుంచి వచ్చినవారవడం

ఉదాహరణకు దాదూదయాళ్ చేనేత కార్మికుడు. సూరదాసు బనియా కుటుంబం నుంచి వచ్చాడు. రాయదాసు చెప్పులు కుట్టుకునే వాడు, నామదేవుడు దర్జీ పనివాడు, తుకారాం వర్తక కుటుంబీకుడు. ధన్నా-రైతు కటుంబం నుంచి వచ్చాడు. రామానంద్, కబీరు, సూరదాసు హిందీ భాషలో... నామదేవుడు, దాదూదయాళ్, జ్ఞానేశ్వరుడు

మరాఠీలో... చైతన్యుడు బెంగాలీ -ఒరియా భాషల్లో, గురునానక్ పంజాబీ భాషలో తమ ఉద్యమాలను విస్తృతంగా ప్రచారం చేశారు. హైందవ మతంలో బహుదేవతారాధన ఉండటం వల్ల ఆ మతంలోని పలు శాఖల మధ్య ఐక్యత-సఖ్యత కొరవడింది. ఏకేశ్వరోపాసన వల్ల ముస్లింలలో ఐక్యత ఏర్పడింది. ఇది భారతీయులను మేల్కొలిపింది. ఫలితంగా ఏ పేరుతో ఆరాధించినా అది దేవుడికే చెందుతుందని భక్తి ఉద్యమకారులు వివరించారు. భక్తి ఉద్యమకారులందరూ హిందూమతంలోని సంప్రదాయాలు, మూఢాచారాలు.. బ్రాహ్మణులు, గురువుల ఆధిపత్యాన్ని, విగ్రహారాధనను, తీర్థ యాత్రలను, పవిత్ర స్నానాలను, కుల, మత శాఖలను తీవ్రంగా వ్యతిరేకించారు. నరబలులు, జంతుబలులు, కర్మకాండ, నైవేద్యాలు వంటి కార్యక్రమాలు లేని ఇస్లాం మతం భారతదేశంలో బలపడటంతో.. దాని వ్యాప్తిని అరికట్టాలనే ఉద్దేశమే దీనికి ప్రధాన కారణం. పూజారులు, అగ్రవర్ణాల కట్టుబాట్లను ధిక్కరించలేక దేవాలయాల్లోకి వెళ్లలేని దుస్థితికి కుమిలిపోతున్న నిమ్నవర్గాలు, దళితులు, చండాలురను కాపాడడానికి... భక్తి ఉద్యమకారులు హిందూ మూఢాచారాలను, సంప్రదాయ మత కర్మను ఖండించారు. వీరికి సంప్రదాయ వాదుల నుంచి అనేక అవరోధాలు ఎదురైనప్పటికీ సహనం, పట్టుదలతో తమ కార్యక్రమాలను కొనసాగించారు.

అన్ని మతాలకు స్థానం...

భక్తి ఉద్యమంలో ఎలాంటి బేధాలు లేకుండా అన్ని కులాలు, మతాల వారికి ప్రవేశం కల్పించారు. సచ్ఛీలత, నిర్మల హృదయం, సౌభ్రాతృత్వం, సోదరభావం, ప్రేమ- కరుణ - దయాదాక్షిణ్యాలు అందరూ అలవర్చుకోవాలని ప్రబోధించారు. భక్తుల్లో హెచ్చుతగ్గులు, తారతమ్యాలు లేవని నినదించారు. దీంతో అధిక సంఖ్యలో అన్ని కులాల, మతాల, రైతులు, కార్మికులు, సేవకులు, శ్రామికులు భక్తి ఉద్యమం పట్ల ఆకర్షితులయ్యారు. అగ్రవర్ణాలు మాత్రం అంతగా ప్రభావితులు కాలేదు. వారి ఆలోచనలు, ఆచారాలు సంప్రదాయబద్ధంగానే ఉండిపోయాయి. భక్తి ఉద్యమం సమాజంలో పెనుమార్పులు తీసుకొచ్చింది. సహపంక్తి భోజనాలు చేయడం, కలిసిమెలసి సంచరించడం, సార్వజనీన సభలు, సమావేశాలు నిర్వహించడం వంటివి వినూత్న సమాజ సృష్టికి సంకేతాలుగా నిలిచాయి.

ఈ ఉద్యమ ఫలితంగా సమాజంలో కులమత బేధాలు, మూఢాచారాలు, సదాచారాలపై హిందూ-ముస్లింల మధ్య ఘర్షణలు, కక్షలు కొంతమేర తగ్గాయి. భక్తి ఉద్యమకారులంతా హిందూ-ముస్లింల మధ్య సదవగాహన పెంపొందించి, రెండు మతాల మధ్య కొంత సారూప్యతను సాధించగలిగారు. అయితే శాశ్వత ఫలితాలను పొందలేకపోయారు. భక్తి ఉద్యమకారులు బ్రాహ్మణుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడకుండా... ఎక్కువమంది నిమ్నజాతుల నుంచి వచ్చినవారే కాబట్టి ప్రజల్లోకి చొచ్చుకుపోయారు. భగవంతుడిని భక్తి ద్వారా చేరుకోవచ్చని, మోక్షం పొందవచ్చని, నిరాడంబరంగా ప్రబోధించారు. హిందూ, ముస్లింలు మూఢాచారాలు, దురాచారాల వల్ల అనేక కష్టనష్టాలను ఎదుర్కొన్నారు. ఉద్యమకారులు కులాలను వ్యతిరేకించడంతో ప్రజల్లో నూతన సామాజిక స్ఫూర్తి వచ్చింది. అట్టడుగు వర్గాలకూ సమాన అవకాశాలు లభిస్తున్నాయని భావించారు. భక్తి ఉద్యమం వల్ల మత సంస్కరణలే కాక... ప్రాంతీయ భాషా సాహిత్యంలో గొప్ప వికాసం వచ్చింది. ఉద్యమ కారులు దేశమంతా పర్యటించి ఆయా స్థానిక భాషల్లో ప్రబోధాలు చేయడమే ఇందుకు కారణం. రామానందుడు, కబీరు హిందీ భాషలో గేయాలు రచించారు. నామదేవుడు మరాఠీ భాషలో రచించగా రామాయణ, మహాభారతాలను సంస్కృతం నుంచి దేశీయ భాషల్లోకి అనువదించారు. భారతీయ తత్త్వశాస్త్ర గ్రంథాలను పారశీక భాషలోకి అనువదించారు. కాశ్మీర్‌కు చెందిన జయన్-ఉల్-అబిదిన్ రామాయణ, మహాభారతాల్ని అనువదించాడు. భారతీయ యోగ, వేదాంత, వైద్య, జోతిష శాస్త్రాలు ముస్లిం మత ప్రచారకులను, సన్యాసులను ఆకర్షించాయి. హిందువులు అరబిక్ క్యాలెండర్‌ను పాటించడం ప్రారంభించారు.

సూఫీమతం

ఇస్లాం మతం నుంచి ఆవిర్భవించిందే సూఫీ మతం. సూఫీలు ఇస్లాం మతంలో తొలిదశలో మార్గదర్శకవాదులు, ఏకేశ్వరోపాసకులు. ప్రపంచంలోని జీవరాసులన్నీ భగవంతుడిలో సమాహారమై ఉన్నాయని వారి విశ్వాసం. భగవంతుడు ఒక్కడే. సర్వం జగన్నాధం. సర్వ సంగపరిత్యాగం చేసి, ప్రేమతో సేవించి భగవంతుడిని చేరవచ్చని సూఫీలు ప్రచారం చేశారు. ఇస్లాం ఏర్పడ్డాక సుల్తానులు, కులీనులు తమ సంపదలను ప్రదర్శించుకోవటాన్ని, నైతికంగా పతనమవటాన్ని సూఫీలు వ్యతిరేకించారు. వీరి మూల సిద్ధాంతం 'వహదత్-ఉల్-ఉజాద్'. దీని ప్రకారం హఖ్ (సృష్టికర్త), ఖలక్ (సృష్టించినవారు) మధ్య ఏకత్వం ఉందని విశ్వసించారు. దేశంలో ముస్లింల పాలన ఏర్పడకముందే సూఫీలు వచ్చారు. తురుష్క సామ్రాజ్యం విస్తరించిన తర్వాత వీరి సంఖ్య ఎక్కువైంది. సూఫీ, వాలి, డర్వేస్, ఫకీరు మొదలైనవి ముస్లిం సన్యాసుల పేర్లు. మొఘలుల కాలంలో 14 సూఫీ శాఖలు ఉన్నట్లు అబుల్ ఫజల్ తన 'అయినీ అక్బరీ' గ్రంథంలో పేర్కొన్నాడు. అందులో ప్రధానమైన శాఖలు 'నాలుగు' అని గుర్తించారు. భారతదేశంలో చిష్టీశాఖ, సుహ్రావర్దీ శాఖ, కాద్రీ శాఖ, నక్షాబందీ శాఖలున్నాయి. సూఫీలు విగ్రహారాధనను, బాహ్య ఆడంబరాలతో కూడిన మతకర్మలను వ్యతిరేకించారు. రోజువారీ ప్రార్థనలు (నమాజ్), తీర్థ యాత్రలు (హజ్), ఉపవాసాలు (రోజా) పట్ల వారికి నమ్మకం లేదు. మనిషికి కోరికలుండకూడదని ప్రచారం చేశారు. దేవుణ్ని చేరడానికి ఆత్మనిర్మలత్వం, అచంచల భక్తి విశ్వాసాలు, గాఢమైన ప్రేమాభిమానాలు అనివార్యమని విశ్వసించారు. సంగీతం- నృత్యం ద్వారా భగవంతుడిని కీర్తించారు. భగవంతుడికి సంగీతం ప్రీతిపాత్రమని వారి విశ్వాసం. భగవంతుని సన్నిధి చేరాలంటే, గురువు (పీర్) సహాయం తప్పకుండా కావాలని చెప్పారు. ఇదే సూఫీమత సిద్ధాంత సారాంశం.

భక్తి ఉద్యమంపై ఎం.జి.రనడే అభిప్రాయం...

'భక్తి ఉద్యమం ప్రభావంతో భారతీయ ప్రాంతీయ భాషల అభివృద్ధి, సమాజంలో కుల మతాల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. సమాజంలో కుటుంబ వ్యవస్థ, స్త్రీల ఉన్నత స్థితికి దోహదపడింది. మానవత్వం, దయా దాక్షిణ్యాలతో పాటు, ఇస్లాం మతంలో కొంత సఖ్యత ఏర్పడ్డాయి. వ్రతాలు, ఉపవాసాలు, తీర్థయాత్రలు, విగ్రహారాధన పట్ల ప్రజల్లో నిరసన భావన కలిగింది. ఉద్య మకారుల వల్ల భారతీయుల సం స్కారం, తాత్విక చింతన భావన ఉన్నత శిఖరాలు అధి రోహించాయి'.

సూఫీ మత విశిష్టత

''సూఫీతత్వం అఖండ భక్తి పూరితమైన మతం. దానికి ప్రేమే స్ఫూర్తి. నృత్య, గీత, గానాలు పూజ మర్గాలు. భగవంతునిలో లీనం కావటం సూఫీ ఆశయం.''

- తారాచంద్

''వాస్తవంగా సూఫీతత్వం ఒక మతం. అంతకంటే మత మౌఢ్యం లేని తత్వవేత్తల, రచయితల, యోగుల మానసిక ఆనందదాయకమైంది.''

- బి.ఎన్. లూనియా